క్లుప్తంగా

తెలుగుగంగకు నీరు విడుదల



తెలుగుగంగ ప్రధాన కాల్వలో పారుతున్న నీరు

రుద్రవరం:వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ కాల్వకు అధికారులు నీరు విడుదల చేశారు. దాదాపు వెయ్యి క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేయగా బుధవారం రుద్రవరం సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని తుండ్ల వాగు (గండ్లేరు)రిజర్వాయరుకు చేరుకుంది. అలాగే ప్రధాన కాల్వ నుంచి మండల పరిధిలోని 16వ బ్లాక్ నుంచి 25వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వలకు చేరుకున్నాయి. నీరు రావడంతో ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన మొక్క జొన్న, మినుము,వరి,పత్తి వంట పంటలకు పారించుకుంటున్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న గంగుల మనోహర్‌రెడ్డి

రుద్రవరం: మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చోళవేటి లక్ష్మీనారాయణ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పుట్లాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపి ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. సహకార సంఘం డైరెక్టర్ పుల్లారెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, కృష్ణారెడ్డి,కొల్లం పుల్లయ్య, గంగిశెట్టి మద్దిలేటయ్య,జాకీర్, కృష్ణమూర్తి, నంబర్‌వన్ ఉశేని తదితరులు నివాళులర్పించారు.

వర్షం కోసం రైతుల ప్రత్యేక పూజలు



మల్లికార్జున స్వామికి జలాభిషేకం చేస్తున్న రైతులు

నంద్యాల(వ్యవసాయం): సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలనే సంకల్పంతో పట్టణంలోని గుడిపాటి గడ్డ రైతుల ఆధ్వర్యంలో స్థానిక మల్లికార్జున స్వామి దేవాలయంలో బుధవారం స్వామివారికి జలాభిషేకం చేపట్టారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహన్యాసపూర్వక ఏక రుద్రాభిషేకం జరిపించిన అనంతరం 1,008 బిందెలతో జలాభిషేకం, 108 నారికేళాలు సమర్పించారు. గుడిపాటిగడ్డ రైతులు ప్రసాద్, మాజీ కౌన్సిలర్ బుజ్జయ్య, మునిసిపల్ కో ఆప్షన్ మెంబర్ పడకండ్ల సుబ్రహ్మణ్యం, దండె సుధాకర్, మిద్దె సుబ్బయ్య, లింగమూర్తి, దండె శ్రీనివాసులు చిన్న తిమ్మయ్య, రాముడు పాల్గొన్నారు.

కొనసాగిన క్రీడా పోటీలు



పరుగు పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండో రోజు బుధవారం మండల స్థాయి క్రీడల పోటీలు కొనసాగాయి. స్థానిక కస్తూర్బా, ఏపీ మోడల్ పాఠశాల,ఆల, మూరు, నర్సాపురం, ఎల్లావత్తుల తదితర పాఠశాలలకు చెందిన బాల బాలికలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచిన వారికి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు,పీడీలు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను వినియోగించుకోండి



కోటకొండలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

రుద్రవరం: మండలంలోని కోటకొండలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ పోగ్రాంను వినియోగించుకోవాలని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం 104 వాహనంతో గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహించగా స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి రోగులు,గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశామని చెప్పారు.

కానాల పంచాయతీ కార్యదర్శిగా మల్లి నరేంద్ర

నంద్యాల(అర్బన్): కానాల మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా మల్లి నరేంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. చాబోలు గ్రామ పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నరేంద్రకు కానాల కార్యదర్శిగా మండల అధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ప్రజారోగ్యమే ప్రధానం

- ఈ నెల 15 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' అవగాహన కార్యక్రమాలు
- ప్రజల ఆరోగ్య సమస్యలపై విస్తృతంగా సర్వే
- ఈ నెల 30న జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు
- జనానికి ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు
- అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స
- ఇంటింటి సర్వే, ప్రజల స్క్రీనింగ్‌కు ప్రత్యేక యాప్

ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యతనిస్తోంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ వంటి విప్లవాత్మక సంస్కరణలతో పాటు కొత్తగా మరో కార్యక్రమాన్ని తలపెట్టింది. 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించి యాప్‌లో నమోదు చేస్తారు. ఏఏ వ్యాధులున్నాయనే వివరాలతో నిర్దేశిత రోజు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వారికి వైద్యపరీక్షలు నిర్వహించి తగిన మందులు ఉచితంగా అందజేస్తారు. చికిత్స అవసరమైన వారికి వెంటనే ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో చేయిస్తారు. ఈనెల15వ తేదీ నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 30వ తేదీన వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ (ఫైల్)

నంద్యాల టౌన్: ప్రజల ఆరోగ్య స్థితిగతులను గుర్తించి, స్థానికంగానే స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా చికిత్స అందించడమే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం కోసం వైద్యఆరోగ్య శాఖ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీ నుంచి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంటింటి సర్వే ఇలా..

జగనన్న సురక్ష కార్యక్రమం లాగానే..జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తారు. ఆరోగ్యశ్రీ కరప త్రాన్ని పంపిణీ చేసి సేవలను వివరిస్తారు. 16వ తేదీ నుంచి నిర్వహించే సర్వేలో భాగంగా ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గృహాలను సందర్శించి ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలను గుర్తిస్తారు. ఇంటింటి సర్వే సమయంలో సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, తగిన బరువు లేని పిల్లలు, క్షయ, కుష్టు, సంక్రమించని, సంక్రమించే వ్యాధులు, గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్, మలేరియా, డెంగీ తదితరాలతో బాధపడుతున్న వారిపై దృష్టి సారిస్తారు. సర్వే సమయంలో ఫొటో తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. నిర్వహించిన పరీక్ష ఫలితాలను డాక్టర్లకు అందుబాటులో ఉంచుతారు. ఆరోగ్య సమస్యలున్న వారు వైద్య శిబిరాలకు హాజరయ్యేందుకు వీలుగా ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు టోకెన్ ఇస్తారు. ఇందు కోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందిస్తున్నారు. జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక అధికారులను నియమించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు..

ప్రతి ఇంటిలో సభ్యులందరికీ ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, డెంగీ, మలేరియా, స్ఫూటమ్ తదితరాల వైద్య పరీక్షలు చేస్తారు. ఇందుకు ప్రతి ఇంటికీ, ప్రతి వ్యక్తికి ఒక కేస్ షీట్ ఏర్పాటు చేస్తారు. రోగాల ఆధారంగా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స చేస్తారు.

ప్రతి ఒక్కరికీ వైద్యం

ప్రజల ఆరోగ్యమమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. ఇందులో భాగంగా స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య శిబిరాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. పీహెచ్‌సీలు, యూసీహెచ్‌సీల్లో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

– జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

స్పెషల్ చికిత్స..

సర్వేలో గుర్తించిన ఆరోగ్య సమస్యలున్న వారికి ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారు. ప్రతిరోజూ.. ప్రతి మండలంలోనూ ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్ తో పాటు ప్రతి పట్టణంలోనూ ఒక వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యశిబిరం నిర్వహిస్తారు. ఆరోగ్య సమస్యలున్న వారిని వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి ఈసీజీ వంటి పరీక్షలు కూడా చేసి.. ఉచితంగా మందులిస్తారు. ఎవరికైనా మరింత చికిత్స అవసరమైతే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు. నెల రోజుల పాటు శిబిరాల నిర్వహణ కొనసాగుతుంది. ఇందు కోసం 162 రకాల మందులు, 18 సర్జికల్ పరికరాలు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్స్, తదితరాలను ఈ నెల 30వ తేదీ వైద్య శిబిరాలు నిర్వహణ మొదలయ్యే నాటికి అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 369 విలేజ్ క్లినిక్స్, 16 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ నెల 30వ తేదీ నుంచి నెల రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రతి క్యాంపునకు సంబంధిత పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్, స్పెషలిస్ట్ వైద్యులు హాజరవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే వైద్య సిబ్బందికి అవసరమైన శిక్షణ, ప్రచార సామగ్రి, టెస్టింగ్ కిట్లు, మందులు తదితరాలను సిద్ధం చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాలటౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల డిపో మేనేజర్ గంగాధరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెల్ నెం.9959225800కు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

15 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే

శిరివెళ్ల: ఈ నెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభమవుతుందని అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌ఓ శారదాబాయి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటి సర్వే చేపడుతారని, సర్వే అధారంగా 30వ తేదీ నుంచి ప్రతి సచివాలయ పరిధిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇద్దరు స్పెషలిస్ట్‌లు, మెడికల్ డాక్టర్లుతో కూడిన బృందం బీపీ, షుగర్, గల్ల, మూత్రం, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ, మహిళల సంబంధించి పరీక్షలు చేస్తారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిచండి

రుద్రవరం: ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని మందలూరులో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు 9,500ఎకరాల్లో పంట నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని, ఇంకా ఎవరైన పంట నమోదు చేయించుకోని వారుంటే ఈనెల 15వ తేదీ లోపు ఆర్‌బీకేల వద్దకు వెళ్లి చేయించుకోవాలని తెలిపారు. అనంతరం అదే గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కషాయం తయారీ, పిచికారీ చేసే విధానంపై రైతులకు వివరించారు. ఏఈఓ రాజు,వీఏఏ మహేశ్వరి ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్‌చంద్రారెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ కోరారు. స్థానిక కార్యాలయ భవనంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సిబ్బందికి శిక్షణ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 15 తేదీన వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ఆరోగ్యశ్రీ గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. 16వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటికీ తిరిగి ఇంట్లో ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి నమోదు చేస్తారని చెప్పారు. అనంతరం వారికి టోకెన్లు ఇచ్చి ఈ నెల 30వ తేదీ నుంచి సచివాలయ పరిధిలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో ప్రత్యేక వెద్యచికిత్సలు అందిస్తారన్నారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. చాపిరేవుల పీహెచ్‌సీ వైద్యులు సుహాలం, ఉదయసంధ్య, అష్రాఫ్ అలీ, సుధాప్రణతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుగుణశ్రీ

ఉయ్యాలవాడ : మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి గ్రామ వలంటీర్లు తమ పరిధిలోని అన్ని కుటుంబాల వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తిస్తారన్నారు. వలంటీర్ల సమాచారం ఆధారంగా ఏఎన్‌ఎంలు, పీహెచ్‌ఓలు ఇంటింటికీ వెళ్లి బాధితులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనంతరం ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసి వారికి చికిత్స అందజేస్తారని చెప్పారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలి



వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ముందుండాలని నంద్యాల టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ గోపీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని పద్మావతి నగర్ లోనున్న ఇండోర్ స్టేడియంలో నంద్యాల మండల స్థాయి అండర్ 14, 17 విభాగాల్లో షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, యోగా పోటీలను నిర్వహించారు. పోటీల్లో 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ప్రతిబ కనపరిచిన వారిని నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఏపీ సీఎం కప్ కోఆర్డినేటర్ ఏపీ రెడ్డి తెలిపారు. 13వ వార్డు కౌన్సిలర్ కాల్వ సరస్వతి, హెచ్ఎం అసదుల్లా, పీడీలు రాణెమ్మ, శివకుమార్ పాల్గొన్నారు.

తరలివస్తున్న బొజ్జ గణపయ్య

నంద్యాల(సిటీ): పట్టణంలో ఈ నెల 18న జరగనున్న గణేష్ చతుర్థిని పురస్కరించుకుని భారీ గణనాథుల విగ్రహాలను బుధవారం పట్టణానికి తీసుకొచ్చారు. సంజీవనగర్ ప్రాంతంలో ప్రతిష్ఠించనున్న 12 అడుగుల పైగా ఎత్తు ఉన్న భారీ బొజ్జ గణపయ్యలను హైదరాబాద్ నుంచి తీసుకొచ్చారు.



లారీలో వినాయక విగ్రహాలను తీసుకొస్తున్న దృశ్యం

కొత్త పింఛన్ల పంపిణీ

నంద్యాల(అర్బన్): పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. మండలానికి రెండు విడతలుగా 566 నూతన పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేశామని, ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బిల్లలాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ భక్తవత్సలమ్మ, పంచాయతీ కార్యదర్శి, లక్ష్మీ ప్రసన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ జనార్దన్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 359 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు కాగా బుధవారం లబ్ధిదారులకు సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకుల చేతుల మీదుగా అధికారులు సొమ్ము పంపిణీ చేయించారు. ఇందులో భాగంగా కోటకొండలో సర్పంచు డేగాని వెంకటేశ్వర్లు, ఆలమూరులో పాణ్యం లక్ష్మీదేవి, చిత్రేనిపల్లెలో సర్పంచు గుండా వరలక్ష్మి, హరినగరంలో కమలమ్మ, ముత్తలూరులో సర్పంచు మహేశ్వరి, మందలూరులో సర్పంచు నిర్మలమ్మ, మండల ఉపాధ్యక్షుడు వీర శంకర్‌రెడ్డిలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు నాగముని,బాల నరసింహయ్య, ప్యాపిలి బాలయ్య,బీసీ ఓబన్న,పాణ్యం చంద్ర, నాగేష్,శూలం ప్రభాకర్,బద్రినారాయణ తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు.

దొర్నిపాడు: మండలంలోని కొండాపురంలో కొత్తగా పింఛన్ మంజూరైన 14 మందికి బుధవారం సర్పంచ్ మాధవి సొమ్ము పంపిణీ చేయించారు. సర్పంచుతో పాటు సచివాలయ కన్వీనర్ శివారెడ్డి,నాయకులు డీలర్ శివుడు,విజయలక్ష్మి,బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : స్థానిక సచివాలయంలో కొత్తగా పింఛన్లు మంజూరైన 15 మంది లబ్ధిదారులకు బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి పింఛన్ సొమ్ము అందజేశారు. మండలానికి కొత్తగా ఈ నెల మొదటి విడత 99, రెండవ విడతలో 113 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సర్పంచ్ మేకల ఓబులేస్, ఎంపీటీసీ సభ్యులు గగ్గెర వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

గోస్పాడు: ఒకే నెలలో రెండు దఫాలుగా కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మొదట్లో 124 పింఛన్లు మంజూరు కాగా, రెండవ విడతలో 119 మందికి విడుదలయ్యాయని చెప్పారు. దీబగుంట్లకు 25, గోస్పాడు 20, జిల్లెల్ల 38, జూలేపల్లె 20, కానాలపల్లె 10, ఎం.క్రిష్ణాపురం 14, నెహ్రూనగర్12, పసురుపాడు 24, సాంబవరం 14, ఒంటివెలగల 17, యాళ్లూరు–1 లో 25, యాళ్లూరు–2లో 30 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం,



లబ్ధిదారుకు పింఛన్లు అందజేస్తున్న దృశ్యం



సాంబవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



ఆలమూరులో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న దృశ్యం



కొత్త పింఛన్‌దారులకు సొమ్ము అందజేస్తున్న దృశ్యం

నాడు జన్మభూమి కమిటీలతో అనర్హులకు పథకాలు

వాగలమర్రి: టీడీపీ హయాంలో పథకాలకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను జన్మభూమి కమిటీలకు అప్పజెప్పడంతో నాడు అనర్హులకు పథకాలు అందాయని, దీంతో అర్హులు ఎంతో నష్టపోయారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన చేపట్టిన తరువాత సీఎం వైఎస్ జగనన్న కేవలం అర్హత ఆధారంగా పథకాలు అందజేసి ప్రజల మనస్సు చూరగొన్నారన్నారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామ సచివాలయం–1 పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి బుక్‌లెట్ అందజేసి వివిధ పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని జగనన్న కాలనీలో 106 మందికి స్థలాలు, గృహాలు మంజూరు చేశామన్నారు. మరికొందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 3 ఎకరాల కొనుగోలుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం టీడీపీ నాయకుడు ఇమాం హుసేన్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



ప్రజలు పొందిన లబ్ధిని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చంద్రబాబునాయుడు నిజాయితీపరుడైతే సీఐడీకి సహకరించాలి..

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో అవినీతికి పాల్పడిన కేసులో అరెస్టయిన చంద్రబాబునాయుడు సీఐడీ విచారణకు సహకరించి నిజాయితీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. దోచుకున్న సొమ్ముతో కోట్లాది రూపాయలు లాయర్లకు చెల్లించి బెయిలు పొందటానికి ప్రయత్నిస్తున్నారన్నారు. బాబు అరెస్ట్‌కు నిరసన చేపడితే నాయకులు, కార్యకర్తల స్పందన కరువడం మన కళ్లతో చూశామన్నారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, సాగునీటి సంఘం చైర్మన్ శేషు రమేష్, ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా. రఫీ, ఎంపీటీసీ వెంకటరాముడు, సర్పంచ్ బుక్కే శంకరమ్మబాయి, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, ఉప సర్పంచ్ ఓబులేసు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో బుధవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరేశ్వర స్వామికి ఉదయాన్నే పంచామృత అభిషేకాలు నిర్వహించి, తిప్పతీగ నీటితో స్వామివారిని అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండలి అధ్యక్షురాలు, కార్యదర్శి ఇందుమతి, శోభారాణి మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం తిప్పతీగ నీటితో స్వామివారికి అభిషేకాలు నిర్వహించామని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

గోస్పాడు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఈఓఆర్డీ అనసూయ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాటాడుతూ సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. పనుల నిమిత్తం అక్కడికి వచ్చే వారి పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని, తమ పరిధిలో లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించాలన్నారు.

బాల్య వివాహాలు నేరం

నంద్యాల(అర్బన్)/న్యూటౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వరల్డ్ విజన్ పీఓ తిరుపతి రావు అన్నారు. అమ్మాయి, అబ్బాయికి నిర్ణీత వయస్సు వచ్చే వరకు వివాహాలు చేయరాదని చెప్పారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జిల్లా జడ్జి రాధారాణి ఆదేశాల మేరకు మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా చైల్డ్ మ్యారేజ్‌పై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మదర్ సొసైటీ సీఈఓ రామారావు, వెంకటేశ్వరరావు, శివరాంప్రసాద్ పాల్గొన్నారు.

టెక్కె మున్సిపల్ హైస్కూల్‌లో..

బాల్య వివాహాలు జరిగితే గ్రామ స్థాయిలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు కేసు నమోదు చేయవచ్చని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ, ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక టెక్కె మున్సిపల్ హైస్కూల్‌లో బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిలో బాల్య వివాహాల నిరోధక, పర్యవేక్షక కమిటీ, విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(సెంట్రల్): ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక శాఖకు అనుబంధంగా ఉన్న 40 విభాగాలకు అవార్డులను ప్రదానం చేయాలని నిర్ణయించినట్లు జిల్లా పర్యాటక సాంస్కృతిక అధికారి శివ సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు ఏపీ టూరిజం వెబ్ సైట్ ఏపీ టూరిజం.జీఓవీ.ఇన్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తులను అనుబంధ ప్రతులను జతచేసి 19వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు స్వయంగా లేదా పోస్ట్ ద్వారా విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ ఐదవ అంతస్తులో ఉన్న ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ రాష్ట్ర కార్యాలయం చేరేలా పంపాలన్నారు. అర్హత కలిగిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అవార్డులను సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో అందజేస్తారని పేర్కొన్నారు. వివరాలకు స్థానిక బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లో ఉన్న జిల్లా పర్యాటక శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రత్యేక స్పందన ఏర్పాటు చేయాలి

శిరివెళ్ల: ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు దండు వీరయ్య కోరారు. బుధవారం జరిగిన జగనన్నకు చెబుదాంలో ఎస్సీల సమస్యలను అధికారులకు నివేదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని విచారణ జరిపించాలని కోరారు. అలాగే ఎస్సీలపై దాడుల నివారణకు గ్రామస్థాయిలో సర్పంచుతో కూడిన శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు.

స్పందన 20వ తేదీకి వాయిదా

మహానంది: బండిఆత్మకూరులో ఈ నెల 15వ తేదీన జరగాల్సిన జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త బుధవారం తెలిపారు. అనివార్యకారణాల వలన 20వ తేదీకి వాయిదా పడినట్లు చెప్పారు.

దేవస్థాన వైద్యశాలకు విరాళం



ఏఈఓ హరిదాసు, వైద్య సిబ్బందికి మందులను అందజేస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం వైద్యశాలకు బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పలు రకాల మందులను దేవస్థానానికి విరాళంగా అందజేశారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, బలహీనత, గ్యాస్ట్రబుల్ తదితర వాటి నివారణ, ఎముకల బలానికి అవసరమైన ఔషధాలను వీరు అందజేశారు. ఔషధాల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు. మందులను సహాయ కార్యనిర్వాహణాధికారి ఎం.హరిదాసుకు అందజేశారు.